క్లుప్తంగా

యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన



మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి దేవస్థానం వద్ద యాగశాల నిర్మాణానికి ఆత్మకూరుకు చెందిన సాంబశివా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. తన సొంత నిధులతో నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. తొలుత పంచముఖ శక్తి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయేంద్ర వరప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

బిట్రగుంట: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 16 పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు చెప్పారు. వర్షాల ముప్పు తప్పే వరకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సచివాలయాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు జాగ్రత్తగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

చేజర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని అఖిల భారత ఆదివాసీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ పెంచలపుల్లయ్య అన్నారు. చేజర్లలోని యూటీఎఫ్ భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 51 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులతో పాటు ఇతర ఆపదల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడడంలో రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తదానంతో దీర్ఘకాలిక వ్యాధులైన కేన్సర్, గుండె జబ్బులు రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్తి విజయ్, సుధాకర్ మహేష్, వెంకయ్య, గోపి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సంగం: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో పెన్నా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం సంగం మండలం వీర్లగుడిపాడు, కోలగట్ల గ్రామాల్లో ఎస్సై రాజేష్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమకు సమాచారం అందజేయాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సీపీఎం డివిజన్ కార్యదర్శిగా సందానీబాషా



ఆత్మకూరురూరల్: మున్సిపల్ పరిధిలోని ఎల్ఆర్‌పల్లి డివిజన్ సీపీఎం కార్యదర్శిగా షేక్ సందానీబాషా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సీపీఎం సమావేశంలో సందానీ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమశిల రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, ఎస్ఎంకే పార్కు అభివృద్ధి, చింతచెట్ల కాలనీవాసులకు పట్టాలు ఇప్పించడం, ఎల్ఆర్‌పల్లిలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, తదితర అంశాలపై పోరాటం చేయాలని తీర్మానించారు. సీపీఎం కార్యదర్శి డేవిడ్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం

వరికుంటపాడు: మండలంలోని విరువూరు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచా మతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.



ఉదయగిరి: రాజరాజేశ్వరిగా పార్వతీదేవి



కావలి: విశేషాలంకారంలో వడ్డిపాలెం కనకదుర్గాదేవి



అల్లూరు: కరెన్సీ నోట్లతో పోలేరమ్మకు అలంకరణ



వరికుంటపాడు: రాజరాజేశ్వరిగా నాగార్పమ్మ



వరికుంటపాడు: నాగార్పమ్మ ఆలయంలో శాంతిహోమం నిర్వహిస్తున్న దృశ్యం



సంగం: ట్రాక్టర్లకు పూజలు చేస్తున్న రైతులు

భక్తిశ్రద్ధలతో విజయదశమి

కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజలు విజయదశమి పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. శక్తిస్వరూపిణి విశేషాలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చింది.



కావలిలో కలుగోళశాంభవి అమ్మవారి గ్రామోత్సవం

కావలి: పట్టణంలో దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. వడ్డిపాళెంలోని కనకదుర్గాదేవి ఆలయం, కావలి గ్రామ దేవత కళుగోళశాంభవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శక్తిస్వరూపిణి మహిషాసురమర్దిని రూపంలో దర్శనమిచ్చారు. కళుగోళశాంభవి గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది.
అల్లూరు: తూర్పుగోగులపల్లిలోని పోలేరమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పోలేరమ్మను కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పోలేరమ్మ పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. కాగా మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి,అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, జ్వాలాముఖి, సుందరమ్మ కోదండ రామమందిరం, చల్లావీధిలోని సంతానలక్ష్మి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి, జ్వాలాముఖి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చల్లావీధిలోని సంతానలక్ష్మి ఆలయంలో వెండి ఉత్సవమూర్తితో చప్పరోత్సవం జరిపారు. కన్యకాపరమేశ్వరి మూలవిరాట్టును స్వర్ణచీరతో అలంకరించారు.
చేజర్ల: మండలంలోని చేజర్ల, బోడిపాడు, యనమదల గ్రామాల్లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. విజయదశమి సందర్భంగా యనమదలలో చింతాలమ్మ అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులను కటాక్షించారు. ఆదివారం చింతాలమ్మ గుడిలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా జితేంద్రరెడ్డి, వినీత వ్యవహరించారు.
మర్రిపాడు: మర్రిపాడులో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు నడుమ అమ్మవారి గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.





జలదంకి, ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లలో పూజలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

అనుమసముద్రంపేట: స్థానిక శ్రీకృష్ణ మందిరంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చింది. ఉభయదాతలుగా శింగంశెట్టి రాజగోపాల్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. సాయంత్రం ఏఎస్‌పేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శమీ దర్శనం కల్పించారు. అమ్మవారి గ్రామోత్సవం వేడుకగా సాగింది. ఆదివారం శ్రీకృష్ణ మందిరంలో అన్నదానం నిర్వహించారు.
సంగం: తిరుమనకొండ రాజరాజేశ్వరీదేవి, సంగమేశ్వరస్వామి, గంగమ్మ, అంకమ్మ, బాలచౌడేశ్వరీదేవి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించి గ్రామోత్సవాలు నిర్వహించారు. సంగం సీఐ వేమారెడ్డి గంగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు..
వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయం, వరికుంటపాడులోని శ్రీనాగార్పమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లు విశేషాలంకరణల్లో దర్శనమిచ్చారు. చివరిరోజు శాంతి హోమాలు నిర్వహించారు.
ఉదయగిరి: పట్టణంలోని పార్వతీపరమేశ్వరి ఆలయం, సంతానలక్ష్మీదేవి ఆలయాల్లో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు.
జలదంకి: విజయదశమిని మండల ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. మండలంలోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ప్రజలు తమ వాహనాలు, యంత్ర సామగ్రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలదంకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై లతీఫున్నీసా ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.
కలిగిరి: మండల ప్రజలు దసరాను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో విశేషాభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. వెంగమాంబ-గురవయ్య దంపతులకు పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఈఓ ఉషశ్రీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. రాచవారిపల్లిలోని శ్రీరామ మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. దుత్తలూరులోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. దుత్తలూరు బీసీ కాలనీలో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొమ్మిదిరోజుల పాటు పూజించిన అమ్మవార్లను నిమజ్జనం చేశారు.



ఆత్మకూరు:కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం



ఆత్మకూరు: స్వర్ణచీర అలంకారంలో కన్యకాపరమేశ్వరి మూలవిరాట్టు



ఆత్మకూరు: విశేషాలంకారంలో అన్నపూర్ణాదేవి



కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం



మర్రిపాడులో అమ్మవారి గ్రామోత్సవం



దుత్తలూరు: వెంగమాంబ ఆలయంలో..



కలిగిరి: తెల్లపాడులో విశేషాలంకరణలో భద్రకాళి

నిత్యావసరాల ధరలను తగ్గించాలని ఆందోళన

ఉదయగిరి: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బిజ్జంపల్లి గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఓ వైపు వ్యవసాయం కలిసిరాక, మరోవైపు నిరుద్యోగ సమస్యలతో గ్రామీణ ప్రాంత ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఈ తరుణంలో నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్య తరతి ప్రజలు జీవనం సాగించడం కష్టతరమైందన్నారు. పండగ రోజు పచ్చడి మెతుకులు కూడా కరువయ్యాయన్నారు. ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికొదిలి అన్ని వస్తువుల ధరలను పెంచి పేదవాడి నడ్డి విరుస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యావసరాల ధరలను నియంత్రించాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్‌లో టీడీపీ నేతల వీరంగం

- కోడి పందెంరాయుళ్ల అరెస్ట్
- తమ వారిని కొట్టారంటూ ఎస్సైతో దురుసు ప్రవర్తన

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో బట్టేపాడుకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి వీరంగం సృష్టించారు. గ్రామ శివార్లలో కోడిపందెంలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు పందెం కోళ్లను, రూ.960 నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. తమ వారిని కొట్టడం ఏమిటంటూ ఎస్సై ఎస్కే జిలానీతో దురుసుగా ప్రవర్తించారు. కోడిపందేలు నిర్వహిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా తాను పట్టుకున్నాని, కేసు నమోదు చేశానని ఎస్సై ఖరాఖండీగా చెప్పడంతో కొద్దిసేపు వాగ్వాదం చేసి స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. జూదరులకు మద్దతుగా పోలీసుల విధులకు ఆటంకం కలిగేలా టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు స్టేషన్‌ను చుట్టుముట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

13 మద్యం షాపులకు 321దరఖాస్తులు

ఆత్మకూరు: ఆత్మకూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో 13 మద్యం షాపులకు 321 దరఖాస్తులు దాఖలయ్యాయని ఎక్సైజ్ సీఐ ఆర్వీ రమణమ్మ ఆదివారం తెలిపారు. మున్సిపల్ పరిధిలో 4, రూరల్ పరిధిలో 2, అనుమసముద్రంపేట 2, అనంతసాగరంలో 3, కలువాయిలో 2 దుకాణాలు చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కలువాయిలోని 144 నంబర్ మద్యం దుకాణానికి అత్యధికంగా 36, ఆత్మకూరు రూరల్ పరిధిలోని 141వ నంబరు దుకాణానికి అత్యల్పంగా 9 దరఖాస్తులు దాఖలయ్యాయని ఆమె వివరించారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



జలదంకి: మండలంలోని గట్టుపల్లి రోడ్డులో విద్యుత్ స్తంభం విరిగిపోయి ప్రమాదభరితంగా ఉంది. స్తంభం కింద భాగంలో విరిగిపోయి చెట్లపై వాలి ఉంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదు. స్తంభం ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. స్తంభం పూర్తిగా నెలకొరిగితే మూగజీవాలు తగిలి మృత్యువాత పడే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పదికి కొనేయ్..పాతికకు అమ్మేయ్

జాతీయ ఆహార భద్రత పథకానికి దళారులు తూట్లు

- లబ్ధిదారుల నుంచి చౌకగా కొనుగోలు
- వ్యాపారులకు అధిక ధరలకు విక్రయం
- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ (ఫైల్)

ఆత్మకూరు: పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియం పక్కదారి పడుతున్నాయి. కొందరు దళారులుగా అవతారమెత్తి లబ్ధిదారుల నుంచి చౌకగా బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం అధికారులకు తెలిసినా అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు జరిపి కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది.
జాతీయ ఆహార భద్రత పథకానికి కొందరు దళారులుగా మారి తూట్లు పొడుస్తున్నారు. ప్రజలు సైతం వారికి సహకరించడం బాధాకరమైన విషయం. దళారులు పెద్ద ఎత్తున బియ్యాన్ని సేకరించి మిల్లర్లు, కిరాణా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు బియ్యాన్ని మరో మారు మరపట్టించి 25 కిలోల చొప్పున బస్తాల్లో నింపి ఏ1 గ్రేడ్ బియ్యం మాదిరిగా విక్రయిస్తున్నారు. కావలికి చెందిన పలువురు వ్యాపారులు జిల్లాలోని పలు మండలాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు దళారులను నియమించుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

మండలం	రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు
ఆత్మకూరు	37	18,898
ఏఎస్‌పేట	26	10,788
సంగం	33	14,585
మర్రిపాడు	35	13,834
చేజర్ల	36	11,252
అనంతసాగరం	37	13,948

ఆత్మకూరు నియోజకవర్గంలో 204 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 83,305 కార్డులు ఉన్నాయి. సగటున ప్రతి నెలా 4వేల మెట్రిక్ టన్నుల బియాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దే నాణ్యమైన రేషన్ బియ్యం పంపిణీ చేశారు. దీంతో కొంత మేర అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నాణ్యత లేని బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఎక్కువ శాతం మంది బియ్యం తీసుకోకుండా నగదు తీసుకుంటుండడంతో అవి పక్కదారి పడుతున్నాయి. కొందరు దళారులు కిలో రూ.10 నుంచి రూ.12కు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి రహస్యంగా నిల్వ ఉంచుతున్నారు. ఆ తరువాత లారీల ద్వారా కావలి, చీరాల పట్టణాలకు తరలించి కిలో రూ.22 నుంచి రూ.25 చొప్పున బడా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని రైస్ మిల్లర్లు పాలిష్ చేసి నూతన ప్లాస్టిక్ గోతాల్లో నింపి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గంలో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ చేసినా రేషన్ బియాన్ని అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

- గతేడాది పట్టణంలోని ఉత్తరబలిజవీధి రేషన్ దుకాణంపై దాడులు జరిపిన విజిలెన్స్ అధికారులు అదనంగా బియ్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు.
-ఈ ఏడాది ఏప్రిల్ 4న అనంతసాగరం రోడ్డుపై రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టగా అక్రమార్కులు వాహనాన్ని వదిలేసి పరారయ్యారు. ఐదు టన్నుల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- ఈ ఏడాది ఆగస్టు 25న సంగం వద్ద అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల్లో ఉన్న మూడు టన్నుల బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.
- పది రోజుల క్రితం ఆత్మకూరులో ఎల్ఎంఎస్ పాయింట్ నుంచి హాస్టల్‌కు బియ్యం తరలిస్తున్న వాహనం రేషన్ డీలర్ ఇంటి వద్ద కొన్ని బస్తాలు దింపి ప్లాస్టిక్ గోతాములో విడిగా బియ్యం తీసుకెళ్లారు. ఇలా పేదల ఆకలి తీర్చే బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జూదరుల అరెస్ట్

జలదంకి: మండలంలోని వేములపాడు పొలాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో జలదంకి పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 6,300 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఆత్మకూరురూరల్: దసరా సందర్భంగా మహిమలూరులో గ్రామదేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గ్రామ పెదకాపు మెట్టుకూరు పద్మారెడ్డి ఆధ్వర్యంలో పోలేరమ్మ, పోతురాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని వేడుకున్నారు. గుండ్రా శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఉద్దాల పెంచలరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్సై బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్సైగా దీప్తికరంత్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న మురళీకృష్ణ నెల్లూరు-1 ఎక్సైజ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా కందుకూరు ఎక్సైజ్ స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న దీప్తికరంత్‌ను ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సోమశిల: అనంతసాగరం మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, శ్రీలతను ఎమ్మెల్సీ, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రాధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో ఆదివారం సత్కరించారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే నారాయణరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసు, జిల్లా గౌరవాధ్యక్షుడు రఘురామిరెడ్డి, వై శివశంకర్‌రెడ్డి, మెట్టుకూరు సుబ్బారెడ్డి, డీ సురేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



సోమశిల: దసరా సందర్భంగా అనంతసాగరం మండలం వరికుంటపాడులోని కోదండరామాలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జెడ్పీటీసీ రాపూరు వెంకట సుబ్బారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాపూరు తన నివాసం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.

యువకుడిపై దాడి

ఆత్మకూరు: మండలంలోని నల్లపరెడ్డిపల్లికి చెందిన ఓ యువకుడిపై ఇంటి పక్కన నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై షేక్ జిలానీ వివరాల మేరకు..గ్రామానికి చెందిన షేక్ రసూల్, ఖాజారంతుల్లా, షరీఫ్ దూరపు బంధువులు. రసూల్, ఖాజారంతుల్లా నడుమ చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ కాస్తా పెద్దదైంది. ఈ క్రమంలో ఖాజారంతుల్లాకు తోడుగా షరీఫ్ వచ్చి రసూల్‌పై దాడికి పాల్పడ్డారు. రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాధితుడ్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

తుపాను కంట్రోల్ రూము ఏర్పాటు

ఉదయగిరి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల తహసీల్దార్ కార్యాలయలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు తుపాను కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలాధికారులు కంట్రోల్ రూములో 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం ప్రజలు 99895 02077 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.